అర్ధగంట.. జోరువాన


సూర్యాపేట: కొత్తబస్టాండు వద్ద పైవంతెన కింద నిలిచిన వర్షం నీరు

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం అర్ధగంట పాటు కుండ పోత వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల వరకు భానుడు ప్రతాపం చూపించాడు. దీనికితోడు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. పట్టణ ప్రజలు ఉక్కపోత, ఎండవేడితో ఇబ్బందులు పడటంతో కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

రాకపోకలకు ఇక్కట్లు.. జిల్లా కేంద్రంలో వర్షం కారణంగా రహదారులపై నీళ్లు నిలిచాయి. కొత్తబస్టాండ్, కుడకుడ రోడ్డు, వీటీరోడ్లు, శంకర్‌విలాస్ రహదారిపై వరద పారింది. సాయంత్రం పనులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. కొత్తబస్టాండ్ పైవంతెన వద్ద వర్షం తగ్గే వరకు వేచి ఉన్నారు. వీధి వ్యాపారులు వానలో తడుస్తూనే ఉండిపోయారు. రహదారులపై వరద నీరు నిల్వడంతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. వర్షం కారణంగా కొత్తబస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను మళ్లించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.

24న గవర్నర్ పర్యటన

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 24న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఉందని, అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ శాఖలకు సంబంధించి అధికారులు పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను పీపీటీ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన వివిధ కళాకారులు, కవులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో అప్పారావు, డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో కోటా చలం, డీఎస్‌వో రాజేశ్వర్, ఏవో సుదర్శన్‌రెడ్డి, డీపీవో నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెంచితే.. మంచిదే

★ హాస్టళ్ల మెస్, కాస్మెటిక్ ఛార్జీలపై ప్రభుత్వ నిర్ణయమే తరువాయి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:


సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు

నిరుపేద విద్యార్థులకు పోషకాహారం, ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సంక్షేమ హాస్టళ్లకు మెస్ ఛార్జీలు పెంచాలంటూ ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వానికి నివేదించగా.. 15 ఏళ్ల నుంచి విద్యార్థుల ఎదురు చూపులకు మోక్షం కలుగనుంది. ఈ నెల 21న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా 40 శాతం పెంచాల్సిన అవసరం ఉందంటూ ఉన్నతాధికారుల కమిటీ నివేదించింది. దీంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎంతో ఆశగా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచితే పోషకాహారం అందించవచ్చని విద్యార్థి సంఘాలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


★ గురుకుల పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 540 మంది విద్యార్థులు చదువుతుండగా, కళాశాల ఉన్న గురుకులాల్లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల మంది విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపుతో ప్రయోజనం చేకూరనుంది.


ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లు..

జిల్లా	ఎస్టీ	ఎస్సీ	బీసీ	గురుకులాలు	కేజీబీవీ
నల్గొండ	43	60	37	55	27
సూర్యాపేట	20	36	24	42	18
యాదాద్రి	6	21	21	12	9

ఉన్నతాధికారుల కమిటీ డైట్ ఛార్జీ సిఫార్సులు..

తరగతి	ప్రస్తుతం (రూ.లలో)	నివేదించినది (రూ.లలో)
3-7 తరగతులు	950	1,330
8-10 తరగతి వరకు	1,100	1,540
ఇంటర్-పీజీ	1,500	2,100





పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలి..

– కమ్మంపాటి శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మార్కెట్‌లో వస్తుసామగ్రి ధరలు 15 ఏళ్ల క్రితం కంటే పదిరెట్లు పెరిగాయి. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులకు రూ.2వేలు, కళాశాల విద్యార్థులకు రూ.3వేలు పెంచాలి, కాస్మెటిక్ ఛార్జీలు విద్యార్థినులకు రూ.500, విద్యార్థులకు కనీసం రూ.300 ఇవ్వాలి.

వార్డు అధికారులొచ్చేశారు

❑ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతానికి నియామకం

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:


సూర్యాపేటలో క్షేత్రస్థాయిలో ప్లాటు దరఖాస్తును పరిశీలిస్తున్న వార్డు అధికారులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర పురపాలక శాఖ చర్యలు తీసుకుంటోంది. వేలల్లో దరఖాస్తులు రావడం, తక్కువ మంది సిబ్బంది ఉండటంతో పరిష్కారానికి కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించగా.. రాష్ట్ర పురపాలక శాఖ క్షేత్రస్థాయిలో వార్డు అధికారులను నియమించాలని ఆదేశాలు జారీచేసింది. వార్డు అధికారుల నియామకంతో దరఖాస్తుల పరిష్కారం వేగంగా సాగుతోంది.

19 పురపాలికల్లో 175 మంది

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. 1,93,773 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. 2020లో దరఖాస్తులు చేసుకున్నారు. అవి పురపాలిక పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల లాగిన్‌లో ఉంటాయి. ఎల్ఆర్ఎస్-2020 యాప్ ద్వారా వీరు తొలిదశలో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు దశల్లో అధికారుల పరిశీలన కార్యాలయాల్లోనే సాగుతుంది. వేలల్లో దరఖాస్తులు ఉండటం, పైగా అర్జీ పెట్టుకున్న వారి చిరునామాలు గుర్తించటం, స్థలాల హద్దులు నిర్ధారించడంలో ఇబ్బందులున్నాయి. ఈ క్రమంలో పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేవలం మూడు బృందాలు పని చేస్తుండటంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. పురపాలక శాఖ వార్డు అధికారులను నియమించాలని సూచించడంతో పుర అధికారులు ఆ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 175 మంది వార్డు అధికారులను నియమించారు. వీరు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలన చేస్తున్నారు.


ఒక్కొక్కరికి 1100 దరఖాస్తులు

పురపాలికలో ఒక్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉంచకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో అధికారికి 1100 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో పట్టణ పేదరిక నిర్మూలన, మున్సిపల్ వైద్యారోగ్య విభాగాల సిబ్బందిని భాగస్వాములను చేశారు. ఈ మేరకు తనిఖీ బృందాలు పెరగడంతో లక్ష్యం పూర్తయ్యే అవకాశం ఉందని పుర అధికారులు చెబుతున్నారు.

జిల్లా	పురపాలికలు	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు	వార్డు అధికారులు
సూర్యాపేట	5	65,769	59
నల్గొండ	8	72,642	66
యాదాద్రి	6	55,362	50

విద్యార్థి గుర్తింపు.. అపార్

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, మునగాల, న్యూస్‌టుడే:


అపార్ నమూనా కార్డు

ఆధార్‌కార్డు తరహాలో విద్యార్థి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు ఈ కార్డు ఇస్తారు. దీన్నే అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు అంటారు. దేశవ్యాప్తంగా ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కేటాయించే గుర్తింపు కార్డు ఇది. రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో అన్ని పాఠశాలల్లో, ఇతర విద్యా సంస్థలలో ఈ ప్రక్రియ మొదలైంది.

పొందుపర్చే వివరాలు:

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ప్రయోజనాలు..

అపార్ గుర్తింపు వల్ల డిజీలాకర్‌కు అనుసంధానం అవుతారు. దీంతో అన్ని ధ్రువీకరణ పత్రాలను విద్యార్థి సురక్షితంగా భద్రపర్చుకోవచ్చు. పాఠశాల మారినా ఇబ్బంది ఉండదు. విద్యార్థులు పొందుతున్న ఉపకార వేతనాలు, ఇతర ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయంలో, ఇతర అంశాల్లో అపార్ కార్డు ఆధారంగా సమాచారం తీసుకునేలా రూపొందిస్తారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,631 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా.. అందులో దాదాపు 3.85 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో 220 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో దాదాపు 4 వేల మంది చదువుకుంటున్నారు. వీరు కాక డిగ్రీ, పీజీ కళాశాలల్లో మరో 3 వేల మంది విద్యను అభ్యస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న దాని ప్రకారం పాఠశాలల్లో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. కేంద్రం అపార్ కార్డు ద్వారా కేటాయించే క్యూఆర్ కోడ్ సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో ప్రతి విద్యార్థికి సంబంధించిన కేజీ టు పీజీ పూర్తి వివరాలు, సాధించిన విజయాలు, పొందిన ఉపకార వేతనాలు, మెమోలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసంధానమై ఉండటంతో కుటుంబ వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి.

అనుమతి తప్పనిసరి..

అపార్ గుర్తింపు కార్డు కోసం విద్యార్థి, విద్యార్థి వివరాలు తీసుకుంటున్నందున తప్పనిసరిగా ఆ విద్యార్థి తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అపార్ కార్డు కోసం ఎలా నమోదు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై రాష్ట్ర అధికారులు ప్రధానోపాధ్యాయులకు జూమ్ మీటింగ్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో అపార్ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు.

అవగాహన కల్పించి నమోదు చేస్తున్నారు:

అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి, సూర్యాపేట

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అపార్ కార్డు కోసం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివరాలు తెలియచేసి వారి అనుమతి తీసుకొని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. దీనికి చివరి తేదీ అనేది లేదు.

మెరిట్ జాబితా విడుదల

మహాత్మాగాంధీ రోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బాగాంధీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితాను విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు డీఈవో అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల మెరిట్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 25న సాయంత్రం 5గంటల లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

బోధన రుసుం బకాయిల విడుదలకు ర్యాలీ

మహాత్మాగాంధీ రోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల బోధన రుసుంలు, ఉపకార వేతనాలు విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పులే


సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ విద్యార్థి సంఘ నాయకులు

విగ్రహం నుంచి బాబు జగ్జీవన్‌రావు విగ్రహం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం సకాలంలో ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. సంక్షేమ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేష్‌చారి, బయ్య రాజేశ్, సాయికుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

లెక్కల్లోనే వనం..!


కోదాడ పట్టణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కోదాడ (సాలర్జంగ్‌పేట), న్యూస్‌టుడే: మొక్కలు నాటే పథకాన్ని ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో నిర్వహిస్తోంది. వానాకాలం సీజన్ ముగిసే దశకు వచ్చినా క్షేత్రస్థాయిలో మొక్కలు నాటే ప్రక్రియ ఆశాజనకంగా లేదు. ప్రభుత్వం విధించిన లక్ష్యం ఎక్కడా నూరుశాతం పూర్తి కాలేదు. ప్రతి పురపాలికలో అధికారులు లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో కానరాని పరిస్థితి..

ప్రతి మున్సిపాలిటీలో ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మొక్కలు కనిపించని పరిస్థితి. అధికారులు చూపుతున్న లెక్కలకు, నాటిన మొక్కలకు పొంతనే లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తే అసలు విషయం బయటపడుతుందని పట్టణ వాసులు చెబుతున్నారు. మొక్కలు నర్సరీల నుంచి కొనుగోలు చేయకపోయినా చేసినట్లు, నాటకపోయినా నాటినట్లు బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. జిల్లాలోని పలు పురపాలికల్లో రహదారుల వెంబడి ఈ ఏడాది నూతనంగా నాటిన మొక్కలు చాలా వరకు కనిపించట్లేదు. అధికారులు మాత్రం 70 శాతం వరకు నాటినట్లు చెబుతున్నారు.

పలు పురపాలికల్లో మొక్కల వివరాలు

పురపాలిక	లక్ష్యం	నాటినవి
కోదాడ	2,13,000	1,44,000
నల్గొండ	3,00,000	1,75,000
హుజూర్‌నగర్	1,09,300	76,500
నకిరేకల్	44,000	42,500
నేరేడుచర్ల	1,35,000	78,500
తిరుమలగిరి	93,300	69,830
మిర్యాలగూడ	1,22,000	49,800
ఆలేరు	72,450	45,000

త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేస్తాం:

సాయిలక్ష్మి, డీఈ, కోదాడ పురపాలక

ప్రస్తుతం పురపాలికలో మొక్కలు నాటే ప్రకియ కొనసాగుతోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. కొన్ని చోట్ల మొక్కలు నాటి ట్రీ గార్డులు కూడా ఏర్పాటు చేశాం. మొక్కలు నాటుతూనే అవి ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

కొనుగోలు కేంద్రాల్లో నీడ వసతి కల్పించండి: కలెక్టర్


అర్వపల్లిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో గడ్డి లేకుండా చదును చేయాలని, రైతులకు తాగునీరు, నీడ వసతి కల్పించాలని సూచించారు. టార్పాలిన్లు నాణ్యతగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు.

★ తిమ్మాపురం, అర్వపల్లి పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. అర్వపల్లిలో మధ్యాహ్న భోజనం, వంటలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పన్నుల వివరాలు, దస్త్రాల నమోదు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ప్రజలు చెప్పడంతో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

★ మండలంలో 40 వేల మొక్కలు ఒకే చోట పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. పీహెచ్‌సీని సందర్శించి నిల్వ ఉన్న మందులు, కావాల్సిన మందుల దస్త్రాలను పరిశీలించారు. పీహెచ్‌సీలో నిర్మించిన సమావేశ గదిని పరిశీలించారు. రోగులతో మాట్లాడారు.

★ తహసీల్ కార్యాలయంలో ధరణి, ఇసుక పన్నులు, కల్యాణలక్ష్మి తదితర వాటిపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో పవన్ కుమార్, ఏవో గణేశ్, ఏపీఎం మల్లేష్, ఏపీవో ఉపేందర్, ఆర్ఐ వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్

అర్వపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న సరకులు, రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలకు తేడా కనిపించడంతో వెంటనే విచారణకు సీడీపీవోను ఆదేశించారు. విచారణ అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్ నవనీతను సస్పెండ్ చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు తెలిపారు.

ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు తప్పనిసరి

భానుపురి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే సూర్యాపేట నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి కోరారు. సూర్యాపేటలో భాజపా జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సభ్యత్వ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలకు తగ్గకుండా నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియ తర్వాత పోలింగ్ బూత్‌కమిటీలు, మండల కమిటీలు నియామకం ఉంటుందని పేర్కొన్నారు. భాజపా నాయకులు సంకినేని వరుణ్ కుమార్, జుట్టుకొండ సత్యనారాయణ, చలమల్ల నర్సింహ, సలిగంటి వీరేందర్, మల్లెపాక సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

పేటలో మూడు ఇళ్లల్లో చోరీలు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లోని తాళం వేసి ఉన్న కిరాణ దుకాణంతోపాటు మరో రెండు ఇళ్లల్లో దొంగలు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్‌కు చెందిన రాకేశ్ తన కిరాణం దుకాణాన్ని సోమవారం రాత్రి మూసి వేసి సమీపంలోని ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు దుండగులు గడ్డపార సాయంతో దుకాణం షెట్టర్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. దుకాణంలోని రూ.60 వేలను ఎత్తుకెళ్లారు. బాలాజీనగర్‌కు చెందిన రోజారాణి అనే మహిళ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం ధ్వంసం చేసి ఇంట్లోని బీరువాలో ఉన్న చెవిదిద్దులు అపహరించారు. సమీపంలోని మరో ఇంట్లోనూ ఇదే తరహాలో ప్రవేశించి రూ.ఐదు వేలు దొంగిలించారు. ఒకే రోజు వరసగా మూడు దొంగతనాలు చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దొంగలు అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వీధుల్లో సంచరించిన దృశ్యాలు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

కొలువుల గ్రంథాలయం

భానుపురి, కుడకుడ రోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే:


సూర్యాపేట: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు


సూర్యాపేట జిల్లాకేంద్ర గ్రంథాలయం కొలువులకు నిలయంగా మారింది. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అభ్యర్థుల సన్నద్ధతకు ఉపయోగపడుతోంది. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అభ్యర్థులు వచ్చి చదువుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. 400 మందికిపైగా సభ్యత్వాలు పొందగా.. రోజూ 300 పైగా యువకులు, విద్యార్థులు వస్తుంటారు. విశాలమైన గదులతోపాటు, అన్ని రకాల వసతులు, వివిధ దినపత్రికలను అధికారులు సమకూర్చుతున్నారు. ఈ గ్రంథాలయంలో 28 వేలకుపైగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న వారిలో చాలామంది పోలీసు, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికవడం విశేషం.

24 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు

సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్న వారిలో ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో 25 మంది ఉద్యోగాలు సాధించారు. కొంతమంది మహిళలకు వివాహాలు జరిగినా భర్తల ప్రోత్సాహంతో రోజూ వచ్చి చదువుకొని తమ కొలువు కలను నెరవేర్చుకున్నారు.

అక్క స్ఫూర్తితో ..


–తుమ్మల ఉష, ఎస్జీటీ, కలకోవ, మునగాల మండలం



మా అక్క ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె స్ఫూర్తితో ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్నా. ఇక్కడ మాకు కావాల్సిన పుస్తకాలు ఉన్నాయి. వాటిని రెండు నెలలుగా చదవడంతో ఉద్యోగం వచ్చేందుకు దోహదపడింది. కోదాడ మండలం గణపవరం ఎంపీపీఎస్ పాఠశాలలో విధుల్లో చేరాను.

రోజూ పది గంటలు చదివా


– వెన్నమల్ల విజయ్‌కుమార్, పీఈటీ, అంబేడ్కర్‌నగర్, సూర్యాపేట



మాది నిరుపేద కుటుంబం. పెయింటింగ్ పని చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. మా నాన్న మరణంతో మా కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి చేరుకుంది. క్రీడలపై మక్కువతో బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసి 2017లో డీఎస్సీ పరీక్ష రాశాను. కొన్ని మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయాను. రోజూ పది గంటలు సూర్యాపేట గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగం సాధించాను. సూర్యాపేట మండలం సోలిపేట జిల్లా పరిషత్తు పాఠశాలలో విధుల్లో చేరాను.

పోలీసు ఉద్యోగం వదులుకొని..

– జటంగి ఉపేందర్, ఎస్జీటీ, బొప్పారం, ఆత్మకూర్(ఎస్)



ఉపాధ్యాయ ఉద్యోగమంటే ఎంతో మక్కువ. 2018లో పోలీస్ కానిస్టేబుల్ ప్రకటన వెలువడిన వెంటనే సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకొని ఉద్యోగం సాధించాను. సెలవు పెట్టి గ్రంథాలయంలో డీఎస్సీకి సన్నద్ధమయ్యా. సొంతవి, గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి ఉద్యోగం సాధించాను. శాలిగౌరారం మండలం కుంచెమర్తి పాఠశాలలో ఎస్జీటీగా విధుల్లో చేరాను.

ఏకరూపం... పంపిణీకి సిద్ధం


పంపిణీకి సిద్ధంగా ఉన్న దుస్తులు

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, చింతలపాలెం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ చిన్నారులకూ రాష్ట్ర ప్రభుత్వం ఏకరూప దుస్తులు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వివిధ డిజైన్లను ఎంపిక చేసి మహిళా సంఘాల వారితో కుట్టించే కార్యక్రమం పూర్తి కావొచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు ఏకరూప దుస్తుల్లో కనిపించేవారు. ఇక నుంచి అంగన్‌వాడీ విద్యార్థులు ఏకరూప దుస్తులతో అంగన్‌వాడీ కేంద్రాలకు రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వస్త్రాన్ని ఎంపిక చేసి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు అందజేసింది. వారు మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చి దుస్తులు కుట్టిస్తున్నారు. వీటిని కొద్ది రోజుల్లోనే పిల్లలకు పంపిణీ చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలందరికీ కాకుండా మూడు నుంచి ఆరు సంవత్సరాల వారికి ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు.

ప్రాథమిక విద్యా కేంద్రాలుగా..

అంగన్‌వాడీ కేంద్రాలను పిండి బడులుగా కాకుండా ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్రాల బలోపేతానికి ఇప్పటికే సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం పోషకాహారం అందిస్తూనే వయసును బట్టి పిల్లలకు విద్యనందిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. వీరికి త్వరలో ఏకరూప దుస్తులు అందించనున్నారు. ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలు చదివి వినిపించడం, తదితర విద్యా కార్యక్రమాలను కూడా నిరంతరం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
అంగన్‌వాడీ ప్రాజెక్టులు	09	05	04
కేంద్రాలు	2,093	1,209	901
విద్యార్థుల సంఖ్య	29,283	14,426	18,432

కుట్టు పనులు పూర్తయ్యాయి

– నరసింహారావు, డీఆర్‌డీవో, సూర్యాపేట

అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి కుట్టు పనులు పూర్తి చేశాం. సిద్ధంగా ఉన్న వస్త్రాలను ఆయా ఆయా కేంద్రాలకు పంపించి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం.


జలంలోకి అతిథిగా.. అద్భుతంగా..!

నల్గొండ జిల్లాలోని జలాశయాలు పూర్తిగా నిండాయి. సాగర్ కాలువల ద్వారా జిల్లాలోని గ్రామ చెరువులను నింపారు. దీంతో చెరువులు జలకళతో అందంగా కనిపిస్తున్నాయి. ముషంపల్లి గ్రామ చెరువు కూడా అలా నీటితో నిండింది. పైగా మేఘాలు వచ్చి చెరువులో వాలినట్టు కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – ఈనాడు, నల్గొండ

ప్రీతమ్..ఆలోచనలు అద్భుతం


తాను గెలుచుకున్న ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో ప్రీతమ్‌కుమార్

నిడమనూరు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ(ఏఐ)పై ఆధారపడుతుందంతో పాటు ఏఐను చాలా చోట్ల వినియోగిస్తున్నారు. అందుకు తగ్గట్లు నూతన ఔత్సాహికులకు ప్రభుత్వం అండగా ఉంటే సాంకేతికంగా అద్భుతాలు చేయడానికి వీలవుతుందని అంటున్నాడు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన పొదిళ్ల ప్రీతమ్‌కుమార్. పాఠశాలల్లో చదువుకునేటప్పుడే రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహించే విజ్ఞాన ప్రదర్శనల్లో పాల్గొని వివిధ అంశాలపై నూతన ఆవిష్కరణలతో మొదటిస్థానం సంపాదించి అమెరికా, సింగపూర్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు.

మూడు సార్లు అంతర్జాతీయ పోటీలకు..

గ్రామానికి చెందిన న్యాయవాది పొదిళ్ల శ్రీనివాస్, అనిత దంపతుల కుమారుడు పొదిళ్ల ప్రీతమ్‌కుమార్ త్రిపురారంలోని ఆల్ఫా పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తిచేశాడు. 2016 ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో రోబోట్రిక్స్ సంస్థ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ ఉపయోగించుకునే అంశంపై విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి పోటీపడిన ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థుల కంటే ప్రీతమ్‌కుమార్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి 'వాటర్‌రోబోట్' అంశంపై జాతీయ స్థాయి మొదటి బహుమతి సాధించాడు. ఆ సంస్థ సింగపూర్‌లో నిర్వహించే పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు. అప్పుడు ప్రీతమ్ మూడో తరగతి చదువుతున్నాడు. ఆర్థిక కారణాలతో ఆ సమయంలో అక్కడికి వెళ్లలేకపోయాడు.

◆ 2017లో ఐఐటీ హైదరాబాద్‌లో నావో టెక్ సంస్థ ఏర్పాటు చేసిన పోటీల్లో స్వచ్ఛభారత్ అంశాన్ని ఎంచుకుని 'చెత్తను శుభ్రపరిచే రోబో'ను తయారుచేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానం సంపాదించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అమెరికాకు ఎంపికయ్యాడు. 2019లో ఆరో తరగతిలో పుణెలో నిర్వహించిన మరో విజ్ఞాన ప్రదర్శనలో 'అగ్నిప్రమాదాలను పసిగట్టే సెన్సార్‌బోట్'ను తయారుచేసి మరోసారి అమెరికాకు వెళ్లేందుకు ఎంపికయ్యాడు. ఆ రెండు సార్లు ఆర్థిక కారణాలతో పోటీలకు హాజరుకాలేకపోయాడు.

◆ ఇప్పటి వరకు పదికి పైగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అన్నింట్లో మొదటి బహుమతులతో పాటు 20 వరకు ప్రశంసాపత్రాలు, 15 వరకు బంగారు, వెండి పతకాలు, జ్ఞాపికలను కైవసం చేసుకున్నాడు.

◆ 'నాకు బలమైన ఆర్థిక వనరులు లేక గతంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయాను. ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోకరాజురంగరాజు కళాశాలలో సీఎస్‌ఈ విభాగంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను' అని ప్రీతమ్ తెలిపాడు.

అన్నదాత ఆగమాగం

ఈనాడు, నల్గొండ – నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చౌటుప్పల్, చిట్యాల, మిర్యాలగూడ, నకిరేకల్, నిడమానూరు, వేములపల్లి, హాలియాలో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షార్పణమైంది. చౌటుప్పల్, చిట్యాల లాంటి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు.

❒ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలుండగా.. ప్రస్తుతం 50 శాతం కేంద్రాల్లోనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడుతుంది.

❒ ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా 7,18,765 ఎకరాల్లో పత్తి సాగవ్వగా 65 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి ఏరే సమయంతో పాటు చేల మీద ఉన్న పత్తి తడవడంతో రంగు మారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిన్నింగ్ వ్యాపారులు సైతం పత్తి నాణ్యత లేదనే సాకుతో అరకొర ధరకు కొనుగోలు చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు తగ్గడంతో ఎన్నెస్పీ అధికారులు రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 71,361 క్యూసెక్కుల వరదనీరు రాగా సాగర్ డ్యాం నుంచి 2 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 15,948 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమ కాల్వలు, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 64,518 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 588.80 అడుగులు కాగా ఇది 308.4658 టీఎంసీలకు సమానం.

వ్యవసాయ ఇంట.. కొలువుల పంట

మునుగోడు, న్యూస్‌టుడే: నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని.. పక్కా ప్రణాళికతో.. సమయాన్ని వృథా చేయకుండా పట్టుదలతో చదివితే సాధించలేని విజయాలంటూ లేవని నిరూపించారు ఆ యువకుడు. కుమారుడు ఉన్నత స్థానంలో నిలవాలని రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. నిరుపేద కారణంగా ఆర్థిక సమస్యలు ఎదురైనా.. ఇంట్లో సర్కారు కొలువుల పంట పండించి వెలుగులు నింపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టతరమైన ఈ రోజుల్లో ఏకంగా నాలుగు కొలువులు కొట్టి అందరి ప్రశంసలందుకుంటున్నారు.. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన సురేష్.

రోజూ పది గంటల సాధన


తల్లిదండ్రులు మదనబోయిన వెంకటేశం-సత్తమ్మలతో కుమారుడు సురేష్

మదనబోయిన వెంకటేశం-సత్తమ్మ దంపతుల రెండో కుమారుడు సురేష్.. ఓయూలో 2016లో బీఈ(బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్) పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా హైదరాబాద్‌లో అద్దె ఇంట్లో ఉంటూ నిత్యం పది గంటలపాటు సాధన చేశారు. ఆ పట్టుదలతోనే 2023లో తొలి ప్రయత్నంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ)లో రైల్వే మేనేజర్ ఉద్యోగం సాధించారు. అనంతరం వరసగా 2024 జూన్‌లో నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), ఆగస్టులో టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్, టీజీపీఎస్సీ గ్రూప్-4కు సైతం ఎంపికయ్యారు. వీటిలో ఏఈఈ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని సెప్టెంబరు 30న సూర్యాపేట డివిజన్ పరిధిలోని మోతె సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు సైతం స్వీకరించారు. 'అమ్మానాన్నల సహకారంతో కష్టపడి చదువుకున్నా. పట్టుదలతో సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించా. గ్రూప్-1 సాధించాలనే లక్ష్యంతో ఖాళీ సమయంలో కసరత్తు చేస్తున్నాన'ని సురేష్ పేర్కొన్నారు.

జలసేద్యం.. ఆరోగ్య భాగ్యం


జలసేద్యం పద్ధతిలో సాగవుతున్న ఆకుకూరలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అతనో సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ వరకు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో తమకున్న భూమిలో పలు రకాల పంటలు సాగిస్తున్నాడు. అందరిలా కాకుండా.. వినూత్నంగా, ఆరోగ్యకరంగా ఆకుకూరలు పండించాలని సంకల్పించి.. ఇది వరకే సాగు చేస్తున్న వారి సలహాలతో జలసేద్యాన్ని ప్రారంభించాడు. ఇటీవలే పంట వినియోగానికి సైతం వచ్చింది. మిర్యాలగూడ పట్టణంలో జల సేద్య విధానంలో పంటలను సాగు చేస్తున్న ఆ రైతు తన అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

వాతావరణాన్ని నియంత్రిస్తూ..

జలసేద్యం కోసం మిర్యాలగూడలోని బైపాస్ రహదారి పక్కన పది గుంటల స్థలంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేకంగా పాలీ హౌస్ ఏర్పాటు చేశాను. వీటి ప్రత్యేకత ఏంటంటే కాలమేదైనా వాతావరణం మారకుండా చూసుకుంటాయి. దీంట్లో భాగంగా తొలుత ఆకుకూరల విత్తనాలను చిన్న చిన్న ట్రేలలో కోకోపిట్(కొబ్బరి పీచు పొడి)లో 15 రోజుల పాటు ఉంచుతాం. అనంతరం ఆ మొక్కలను పైపు ఛాంబర్లలోకి మార్చుతాం. ఇందులో ఎటువంటి మట్టి, కోకోపిట్ ఉండదు. వీటికి పైపుల ద్వారానే కావాల్సిన పోషకాలు అందిస్తాం. మొత్తం మూసి ఉంచడం వల్ల ఎటువంటి పురుగులు, దోమలు లోపలికి రావు.

యూట్యూబ్‌లో చూసి..

నా పేరు పడిగపాటి వెంకట్‌రెడ్డి. మాది దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం. నాకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. దీంతో కొన్నేళ్లుగా వ్యవసాయంలో వినూత్న పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నాను. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆకుకూరలు అందించాలనే లక్ష్యంతో అన్వేషిస్తుండగా.. యూట్యూబ్‌లో హన్మకొండకు చెందిన రవికిరణ్‌రెడ్డి వీడియోలు చూసి వారి సలహాలతో జలసేద్య పద్ధతిలో ఆకుకూరలు సాగు చేయడం ప్రారంభించాను.

మరీ అవసరమైతే వేప నూనె మాత్రం కొడతాం. నిరంతరం 30డిగ్రీల సెల్సియస్ లోపు ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

వృథా ఉండదు..

సాధారణ పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో అధిక శాతం వృథాగా పోతుంది. జలసేద్య పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో ఎటువంటి వృథా ఉండక పోగా.. కాడలు సైతం తినొచ్చు. ఆరోగ్యంతో పాటు రుచిలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పాలకూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, చెర్రీ టమాట వంటి పంటలు సాగు చేస్తున్నాం.

త్వరలో ఆన్‌లైన్‌లో అమ్మకాలు...

ప్రస్తుతం మేము ఇటీవలే ప్రారంభించిన హోటల్ విహార్‌లో ఈ ఆకుకూరలు, కూరగాయలు వినియోగిస్తున్నాం. దీంతో పాటు ఇక్కడికి వచ్చిన వినియోగదారులకు సైతం ఆకుకూరలు విక్రయిస్తున్నాం. ప్రతి 25 రోజులకోసారి పంట వస్తుంది. త్వరలోనే ఆన్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభించి.. డోర్ డెలివరీ సైతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

నాసిరకం సింథటిక్ రంగులతో చిరుతిండి తయారీ

◆ తయారీదారుడిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: నాసిరకం సింథటిక్ రంగులను వినియోగిస్తూ చెకోడీలు, మిక్చర్, చిరుతిండి పదార్థాలు తయారు చేసి, సరఫరా చేస్తున్న వ్యక్తిని మంగళవారం యాదగిరిగుట్టలో ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. యాదగిరిగుట్ట ఠాణా సీఐ రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన చిన్న ఆనంద్ అనే వ్యక్తి చిరుతిండి పదార్థాలు తయారు చేస్తూ దుకాణాలకు, శుభకార్యాలు, వివిధ ఆర్డర్లపై సరఫరా చేస్తుంటాడు. ఈ పదార్థాలలో నాసిరకం సింథటిక్ రంగులు వాడుతున్నాడనే సమాచారంతో ఎస్వోటీ పోలీసులు మంగళవారం తయారు కేంద్రాన్ని తనిఖీ చేశారు. 500 గ్రాములు కలిగిన వివిధ సింథటిక్ రంగు డబ్బాలు7, 34 చెకోడీ పొట్లాలను, కిలో బరువు కలిగిన 6 మిక్చర్ పొట్లాలు, నలుపురంగులో ఉన్న 5 కిలోల నూనె స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. తయారీదారుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షూటింగ్‌ల అడ్డాగా.. దండుమల్కాపురం



చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చుట్టూ ఎత్తైన కొండలు..ఆహ్లాదకరమైన ప్రాంతం.. రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటంతో సినిమాల చిత్రీకరణలకు కేరాఫ్‌గా మారింది దండుమల్కాపురం. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఈ గ్రామం శివారులో పలువురు అగ్ర హీరోల సినిమాలను చిత్రీకరించారు. ఎక్కువగా ఇక్కడ అగ్ర హీరోల సినిమాల్లోని క్లైమాక్స్ ఫైటింగ్ సన్నివేశాలనే చిత్రీకరించారు. ప్రస్తుతం హీరో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న సినిమా చిత్రీకరణ కూడా ఇదే గ్రామంలో జరుగుతుంది. నెల రోజుల క్రితమే ఇక్కడ వేసిన రాజస్థాన్ పల్లెటూరు సెట్టింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే హీరో బాలకృష్ణ, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్‌పై పలు కీలక సన్నివేశాలను దర్శకుడు కె.ఎస్. రవీంద్ర(బాబీ) తెరకెక్కించారు. మరికొన్ని రోజుల పాటు ఇక్కడ సినిమా చిత్రీకరణ జరుగనున్నట్టు షూటింగ్ సిబ్బంది పేర్కొన్నారు.

గబ్బర్ సింగ్ సినిమాతో మొదలు..


గబ్బర్‌సింగ్ సినిమాలో స్కార్పియోలతో ఫైటింగ్ సన్నివేశం చిత్రీకరణ

దండుమల్కాపురంలో తొలుత పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్' సినిమా క్లైమాక్స్ ఫైటింగ్‌ను చిత్రీకరించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్కార్పియో వాహనాలతో తీసిన ఛేజింగ్ ఫైటింగ్ సన్నివేశం సినిమాలో హైలెట్‌గా నిలిచింది. ఇదే సినిమాలో ఓ పాటలో సన్నివేశం కూడా ఉంది. దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో హీరో ప్రభాస్ నటించిన 'రెబల్' సినిమా చిత్రీకరణ కూడా ఇక్కడే జరిగింది. హెలీకాప్టర్‌లో ప్రభాస్ రావడం, హీరో, విలన్ మధ్య ఫైటింగ్ చేసే సన్నివేశాలను ఇక్కడే తీశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో హీరో మహేశ్‌బాబు నటించిన 'ఆగడు' సినిమా కూడా జరిగింది. సుకుమార్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన 'నాన్నకు ప్రేమతో' సినిమా షూటింగ్ కూడా ఇక్కడే తీశారు. సినిమాలో విలన్ జగపతిబాబు వ్యాపారంలో భాగంగా నిర్మించే గ్యాస్ ప్లాంట్ సెట్టింగ్‌ను వేసి.. హీరో, విలన్, హీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్‌పై పలు సన్నివేశాలను తీశారు. సినిమాలో వచ్చే ఫైటింగ్‌లలో, పాటలో కూడా పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా షూటింగ్‌లు జరిగిన ప్రాంతాలు ఇప్పుడు పారిశ్రామిక పార్కులో కలిసిపోయాయి. ఇప్పుడు పారిశ్రామిక పార్కు ఎదురుగానే బాలకృష్ణ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. గుణశేఖర్ దర్శకత్వంలో హీరోలు అల్లు అర్జున్, రానా దగ్గుబాటి, హీరోయిన్ అనుష్క నటించిన 'రుద్రమదేవి' సినిమా, సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో హీరో చిరంజీవి నటించిన 151వ సినిమా 'సైరా నరసింహారెడ్డి' సినిమాలు దండుమల్కాపురం రెవెన్యూ పరిధిలోని మైలారం రోడ్డులోని గుట్టల్లోనే చిత్రీకరించారు. ఈ సినిమాల కోసం భారీ సెట్టింగ్‌లను వేశారు.

రాగి తీగ చోరీ చేస్తున్న ముఠాకు రిమాండ్


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కాపర్ తీగను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

కోదాడ, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కట్ట మీద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికల్లోని రాగి తీగలను చోరీ చేయడమే లక్ష్యంగా ఐదుగురు వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను ఎట్టకేలకు మునగాల పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

❍ నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచెం కోటేశ్, రూపాని గోపి, రూపాని నాగయ్య, వరికుప్పల శ్రీను, కుంచెం విజయ్‌లు ఐదుగురు ఒక ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా కాపర్ వైర్లను దొంగిలించి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వపైన మునగాల పరిధిలోని ఆర్-9 లిఫ్ట్, కలకోవ రైతు రక్షణ కమిటీ ఎత్తిపోతల పథకం లిఫ్టులకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికలోని కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. లిఫ్టు నిర్వాహకులు మునగాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

❍ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొద్దులచెరువు సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాల మీద ఐదుగురు నిందితులు వెళ్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ కేసుతో పాటు నడిగూడెం, పెన్‌పహాడ్ పోలీసు స్టేషన్ల పరిధితో పాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో కాపర్ తీగను దొంగలించినట్లు ఒప్పుకొన్నారు. నిందితుల దగ్గరి నుంచి సుమారు రూ.3.60 లక్షలు విలువ చేసే 2.20 క్వింటాళ్ల కాపర్ తీగను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకొని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై గతంలో ఒక్కొక్కరిపై సుమారు ఐదు కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో పురోగతి సాధించిన సిబ్బందిని ఆయన అభినందించి రివార్డు అందించారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముషంపల్లి గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్‌రెడ్డి(40) తన వ్యవసాయ భూమిలో మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. శ్రీనివాస్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో సాగుకు సంబంధించిన పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ వైరు కాలుకి తగిలి కింద పడిపోయారు. గమనించిన స్థానికులు నల్గొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

భూమి మార్పిడి కేసులో ఆపరేటర్‌కు బెయిల్

★ తహసీల్దార్ జయశ్రీకి దక్కని ఊరట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి అక్రమంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతుబంధు నిధుల దుర్వినియోగం కేసులో ఏ-2 ముద్దాయిగా అరెస్టయిన ధరణి ఆపరేటర్ జగదీశ్‌కు హుజూర్‌నగర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తు, ఇద్దరు వ్యక్తుల జామీను, ప్రతి శనివారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు హాజరై సంతకం చేయాలన్న నిబంధనలతో బెయిల్ మంజూరైంది. బెయిల్ మంజూరు కావడంతో జగదీశ్‌ను సబ్ జైలు నుంచి విడుదల చేశారు. ఏ-1 ముద్దాయిగా ఉన్న గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీకి బెయిల్ మంజూరు కాకపోవడంతో ఆమె హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. విచారణ ఈనెల 25కు వాయిదా పడింది.

హత్య కేసులో జీవితఖైదు, జరిమానా

హాలియా, న్యూస్‌టుడే: ఒకరిని హత్యచేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావటంతో అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల చినవెంకటరెడ్డికి జీవితఖైదు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ మంగళవారం మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.వేణు తీర్పు ఇచ్చారు. హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జూన్ 12న అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల పెద్ద వెంకటరెడ్డి తన పొలంలో చనిపోయి ఉన్నాడని అతడి భార్య అలుగుల కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పుడు విధుల్లో ఉన్న హాలియా ఎస్సై బీ.సతీష్ కేసు నమోదు చేయగా.. నాటి సీఐ కే.ధనుంజయ్ కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడు హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శిక్షను విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

మహా రుద్రాభిషేకానికి ఆహ్వానం



ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు మహారుద్రాభిషేక ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో 27న నిర్వహించనున్న మహా రుద్రాభిషేకం కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు నిర్వాహక కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, నరసింహారావు, నాగేశ్వరరావు, విజయ్, మల్లికార్జున్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేసి... నిర్వహణ పరిశీలించి

నడిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో బి.ఉపేందర్‌రావు కోరారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. కరివిరాల ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో దస్త్రాలను పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? అనంతగిరి రోడ్‌లోని ఓ గోదాము సమీపంలో వీధి దీపాలు కొన్ని పని చేయడం లేదు. –అబ్దుల్, కోదాడ

✔పరిశీలించి విద్యుత్తు దీపాలు అమర్చుతాం. –నాగరాజు, పుర ఎలక్ట్రీషియన్, కోదాడ

అతిసార వ్యాధి ప్రబలిన ప్రాంతాల సందర్శన

చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార వ్యాధి ప్రబలిన ప్రాంతాలను జిల్లా ఉప వైద్యాధికారి నిరంజన్, నోడల్ ఆఫీసరు నాజియా మంగళవారం సందర్శించారు. కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పలువురు అతిసార బారిన పడి అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో పత్రికల్లో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారితో పాటు వైద్య బృందం ప్రభావిత ప్రాంతాలను పరిశీలించింది. బాధితులు అప్పటివరకు తాగిన నీటిని మళ్లీ పరీక్షించింది. వ్యాధి పూర్తి స్థాయిలో తగ్గేవరకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి సూచించారు. ఏఎన్‌ఎంలు కూడా ఒక్కొక్కరు 30 ఇళ్లను సర్వే చేసి వారి ఆరోగ్య పరిస్థితులను తెలియజేయాలన్నారు. వ్యాధి తగ్గుముఖం పట్టేంత వరకు వైద్యాధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సేవలందించాలని సూచించారు.




వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

ఇదేం చిత్రం..!

కోదాడ గ్రామీణం, కోదాడ, న్యూస్‌టుడే:

ప్రభుత్వాలు మారినా, ప్రక్షాళన జరిగినా రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదు. కోదాడ మండలం నల్లబండగూడేనికి చెందిన గుంజా చిన్న గురవయ్యకు ఎదురైన సమస్య విచిత్రమైనది. విచారణ లేకుండానే రెవెన్యూ అధికారులు చిన్నగురవయ్య చనిపోయినట్లు నిర్ధారించారు. అంతటితో ఆగకుండా ఆయన పేరు మీద ఉన్న ఎకరం భూమిని వారసులకు కాకుండా గ్రామంలోని మరో వ్యక్తి పేరు మీద ఆయన బతికుండగానే ఫౌతి రిజిస్ట్రేషన్ చేశారు. ఇదంతా జరిగి మూడేళ్లకు పైగా అవుతున్నా జరిగిన తప్పును సరిదిద్దే అధికారులే కరవయ్యారు. బతికుండగానే తనను చంపేసిన అధికారులు హాయిగా విధులు నిర్వహిస్తుంటే.. తాను మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ చిన్నగురవయ్యకు చిమిర్యాల రెవెన్యూ పరిధిలోని సర్వే నం.485/2లో ఎకరం భూమి ఉంది. దీనికి సంబంధించి గతంలో రైతుబంధు కూడా వచ్చేది. అప్పటి ధరణి ఆపరేటర్, ఆర్ఐ, తహసీల్దార్ తప్పుడు పత్రాలతో మరో వ్యక్తికి రిజిస్ట్రేషను చేశారు. దీనికి సంబంధించి కొంత నగదు చేతులు మారినట్లు బాధితుడు ఆరోపిస్తున్నారు.



రిజిస్ట్రేషన్ సమయంలో చిన్నగురవయ్య చనిపోయినట్లు చలానా అందించిన రెవెన్యూ అధికారులు

☛ బతికుండగానే బయటి వ్యక్తులకు ఫౌతి రిజిస్ట్రేషన్ చేసిన వైనం

★ చనిపోయిన వ్యక్తి భూమిని మాత్రమే ఫౌతి కింద రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అది కూడా వారసులకు మాత్రమే చేయాలి. ఇక్కడ చిన్న గురవయ్య చనిపోయినట్లు గ్రామంలో విచారించకుండానే రిజిస్ట్రేషన్ చేశారు. వారసులకు కాకుండా సంబంధం లేని మరో వ్యక్తి పేరిట ఎక్కించారు.

★ కొందరు వ్యక్తులు తాను మరణించినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆర్డీవో సూర్యనారాయణకు గురవయ్య మంగళవారం ఫిర్యాదు చేశారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం: సూర్యనారాయణ, కోదాడ ఆర్డీవో

తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం

అనంతగిరి, న్యూస్‌టుడే: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి విస్తీర్ణం ఎంత ఉందో సర్వే చేసిన తర్వాత హద్దులు నిర్ణయిస్తామని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని అజ్మీరతండాలో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి ఇతరులకు విక్రయించారని, దీనికి రెవెన్యూ అధికారులు సహకరించారని ఇటీవల కొందరు గ్రామస్థులు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సూర్యనారాయణ క్షేత్రస్థాయిలో పర్యటించారు. తండాలో సర్వే నంబర్ 50లో రెండు ఎకరాల భూమిని పరిశీలించారు. ఆ సర్వే నంబర్‌లో హద్దు రాళ్లు లేకపోవడంతో భూమిని గుర్తించడం కష్టంగా ఉందని, యుద్ధప్రాతిపదికన భూమిని సర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ హిమబిందు, ఆర్ఐలు, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కోదాడ: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 'విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

నడిగూడెం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై బి.అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఎం నిరంతర పోరాటం: మల్లు



నేరేడుచర్ల: దిర్శించర్లలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పేదల పక్షాన సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. దిర్శించర్లలో మంగళవారం రుద్రమ్మ అధ్యక్షతన జరిగిన సీపీఎం పట్టణ మహాసభలో మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసమే పనిచేస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్పించే జమిలి ఎన్నికల ఆలోచనను విరమించుకోవాలన్నారు. భారాస పదేళ్ల పాలనలో దోచుకుందని విమర్శించారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడంతో పాటు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

హుజూర్‌నగర్: నరేంద్ర మోదీ జమిలి ఎన్నికలు తీసుకు వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని, వాటితో రాజ్యాంగానికి ప్రమాదం అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. మంగళవారం అమరవీరుల స్మారక భవన్‌లో జమిలి ఎన్నికలు వ్యతిరేకించండి అని కోరుతూ మండల పార్టీ సమావేశం జరిగింది.

నడిగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు కోరారు. రత్నవరంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

ప్యాక్స్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సిరికొండ ప్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ వెంకటరెడ్డి, సంతోష్‌రెడ్డి

మోతె, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం కోసం ఇంటి ముంగిట ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సిరికొండ, సర్వారం సహకార సంఘాల ఛైర్మన్లు వెంకటరెడ్డి, శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో ప్యాక్స్‌ల పరిధిలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ధాన్యానికి మద్దతుధర అందివ్వడంతో పాటు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు రైతులకు వివరించారు. నిబంధనల ప్రకారం కేంద్రాలకు ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీఈవోలు అనంతరెడ్డి, ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

పోరాట వీరుడు కుమురం భీం

మునగాల: తెలంగాణ విముక్తికి పోరాడిన వీరుడు కుమురం భీం అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు అన్నారు. భీం జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అమరవీరుల స్మారకభవనంలో మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, స్వరాజ్యం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పురుగు మందులు విక్రయించాలి

మునగాల, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన పురుగు మందులను విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి బి.రాజుతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ప్రదర్శించాలన్నారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రంథాలయాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ అన్నారు. విజయరాఘవాపురం, రేపాల, మాధవరం, మునగాలలో గ్రంథాలయాలను పరిశీలించి మాట్లాడారు. దాతలతో నిర్మించిన భవనాలలో రీడింగ్ రూమ్స్‌కు సరిపడా వసతుల కల్పనను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పార్కింగ్ సరే.. లోపలికి దారేది

హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ వెళ్లే రహదారిలో ఓ బహుళ అంతస్తుల భవనంలో రెండు బ్యాంకులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు బ్యాంకులకు వచ్చే వినియోగదారులకు పార్కింగ్ చేసే స్థలం లేకపోవడంతో బ్యాంకుల ముందు తమ వాహనాలను నిలుపుతున్నారు. బ్యాంకులోకి పోయేందుకు మాత్రం సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి. పుషలు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తరచూ ఎదురవుతున్నాయి. మంగళవారం కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఒక వినియోగదారుడు సామాజిక మాధ్యమాలలో వైరల్ చేశారు. -హుజూర్‌నగర్, న్యూస్‌టుడే



గుట్టలకొద్దీ మురుగు.. ఎట్టకేలకు బయటకు



కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలో ఇటీవల వచ్చిన వరదలకు ఎన్నో రోజుల నుంచి పేరుకుపోయిన మురుగు కారణం. డ్రైనేజీ కాల్వల మీద దుకాణదారులు స్లాబ్ వేయడంతో పారిశుద్ధ్య కార్మికులు మురుగు తొలగించే వీలు లేకపోవడంతో గుట్టల కొద్ది పేరుకుపోయింది. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రైనేజీల్లో మురుగు తీయట్లేదని ఆన్‌లైన్ ద్వారా సామాజిక కార్యకర్తలు ఫిర్యాదులు చేశారు. దీంతో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదేశాల మేరకు పురపాలక అధికారులు మురుగు తీసే పనులు ప్రారంభించారు. ఈ చిత్రంలో రహదారి మీద మురుగు భారీగా కనిపిస్తున్న ప్రాంతం సూర్యాపేటకు వెళ్లే రహదారి. ఈ ప్రాంతంలో వరదల సమయంలో వరద నీరు డ్రైనేజీలో వెళ్లే వీలు లేకపోవడంతో వరద బయటకు వచ్చి సెల్లార్‌లోకి నీరు చేరడంతో అపార్ట్‌మెంటులో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు తీత పనులు ప్రారంభించామని నిర్ణీత గడువు లోపు పనులు పూర్తి చేస్తామని పురపాలక డీఈ సాయిలక్ష్మీ తెలిపారు.

స్టెరిలైజేషన్ చేయించి.. వాటి ప్రాంతాల్లోనే వదిలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్‌లో రోజు రోజుకూ కుక్కల సంఖ్య పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున పురపాలక సంఘం చర్యలు చేపట్టింది. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులతో మంగళవారం ఐదో వార్డులోని కుక్కలను పట్టి స్టెరిలైజేషన్ ప్రక్రియ చేయించారు. స్టెరిలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి తిరిగి వాటిని ఏ ప్రాంతంలో పట్టుకున్నారో అదే ప్రాంతంలో వదలటం జరుగుతుందని కమిషనర్ యాకుబ్‌పాషా తెలిపారు. దశల వారిగా పట్టణంలోని అన్ని ప్రాంతాలలోని కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

దిగుబడి పడిపోతోంది..!



వర్షాలకు పడిపోయిన పొలంలో దోమ, పాముపొడ రాకుండా ఉండేందుకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: అకస్మాత్తు వర్షంతో అన్నదాత అతలాకుతలం అవుతున్నాడు. వరి పడిపోతే దాన్ని కాపాడుకునేందుకు పడే పాట్లు అంతా ఇంతా కాదు. వరి నేలపాలైతే కుళ్లిపోతుందనే ఆందోళనతో రైతులు అదనంగా పురుగు మందుల పిచికారీ చేసుకోకతప్పడం లేదు. దాంతో పెట్టుబడి రెండింతలవుతోంది. దిగుబడి సైతం తగ్గుతుండటంతో రెండు రకాలుగా నష్టం జరుగుతోంది. ఇటీవల కాలంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు ముందుగా నాట్లు వేసిన పొలాలు పడిపోయాయి. యూరియా చల్లకపోయినా రెండు, మూడు రోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలకు పొలాలు ఏపుగా 135 సెం.మీ. వరకు పెరిగాయి. వరి ఈత అనంతరం గింజ పోసుకునే సమయంలో కంకి బరువు పెరుగుతుంది. దాంతో దుబ్బు కర్ర కంకిబరువు ఆపలేక పడిపోతుంది. అలా వరి ఏపుగా పెరిగిన పొలాలన్నీ పడిపోయాయి.

★ మొదట కురిసిన వర్షానికి 20 శాతం పడిపోయిన పొలాలు నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి 40 శాతం పడిపోయాయి. వాటిని మళ్లీ నిలబెట్టడానికి భారీగా కూలీల ఖర్చు అయ్యే అవకాశం ఉంది. దాంతో పాటు అలా నిలబెట్టిన వరి గింజ పోసుకోక తాలుగా మారే అవకాశం ఉంది. దీనికి తోడు గాలి లోపలికి వెళ్లక దోమ ఆశిస్తుంది. పడిపోయిన పొలం నీళ్లలో ఉంటే గింజ మొలకెత్తుతుంది. ఆరబెట్టినా గాలి వెలుతురు ప్రసరించకపోవడంతో దోమ, పాముపొడ ఆశిస్తుంది. దాని వల్ల పూర్తిగా పొలం గడ్డిగా మారుతుంది. దిగుబడి ఎకరానికి పది బస్తాలు రాదు. అందుకే రైతులు పడిపోయిన పొలంలో దోమ, పాముపొడ రాకుండా ఉండేందుకు అదనంగా మూడో సారి పురుగుమందుల పిచికారీ చేయకతప్పడం లేదు. దానివల్ల అదనంగా ఎకరానికి రూ.1,500 ఖర్చవుతుంది.

ఎకరంనరలో పిచికారీ చేశా: శ్రీనివాసరెడ్డి



ఐదెకరాల్లో స్వల్పకాలిక వరి వంగడం వేస్తే వర్షానికి ఎకరంనర పడిపోయింది. కుళ్లిపోతుందని గుర్తించి పాముపొడ, దోమ ఆశించకుండా ఉండేందుకు మందులు పిచికారీ చేశా. ఎకరానికి దాదాపు రూ.1,400 ఖర్చు వచ్చింది. అలా చేయకపోతే దిగుబడి భారీగా పడిపోతుంది. చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడం తీరని నష్టం.

ఐదెకరాలు పడిపోయింది: లక్ష్మయ్య



కౌలుకు తీసుకొని 25 ఎకరాలు వరి వేశా. పంట చేతికి వచ్చే సమయంలో ఐదెకరాలు పడిపోయింది. పడిపోయిన పొలం దిగుబడి ఎంతొస్తదో తెలియడం లేదు. భారీగా పెట్టుబడి పెట్టాం. ఇపుడు పడిపోయిన పొలానికి తెగుళ్లు ఆశించకుండా మందులు కొడుతున్నాం. వాటి ఖర్చు పెరుగుతుంది. కనీసం 35 బస్తాల కంటే ఎక్కువగా దిగుబడి వస్తేనే తట్టుకోగలం.

బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల ధర్నా

నడిగూడెం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నడిగూడెం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రూ.4,500 కోట్లు ఉపకార వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందజేశారు.

శంకరన్ ఆశయాలు ముందుకు తీసుకు వెళ్లాలి



శంకరన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్వేరోస్ ఇంటర్నేషనల్ చీఫ్ కన్వీనర్ బల్లూరి దుర్గయ్య

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలల సిద్ధాంత కర్త, భారత పౌర సేవకుడు, సామాజిక కార్యకర్త ఎస్.ఆర్. శంకరన్ జయంతిని స్వేరోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ చీఫ్ కన్వీనర్ బల్లూరి దుర్గయ్య మాట్లాడుతూ శంకరం ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకుపోవాలన్నారు. ఆయన సేవలను కొనియాడారు. శ్రీను, సుధాకర్, నాగార్జున, రాకేష్, తదితరులున్నారు.

ఉచిత నేత్ర చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలి



నేత్ర శిబిరం ప్రారంభించి పరీక్షలు చేస్తున్న ఛైర్మన్ గోపాల్, క్లబ్ నిర్వాహకులు

నడిగూడెం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట లయన్స్ క్లబ్ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం లయన్స్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నడిగూడెంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చూపు కోల్పోయిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా చూడండి

నేరేడుచర్ల: సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ అందేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. నేరేడుచర్లలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వానాకాలం పంటకు రైతుభరోసా ఇవ్వాలని, రుణ మాఫీ పూర్తి చేయాలన్నారు.

'ఎన్నికల హామీలు విస్మరించిన ప్రభుత్వం'

నేరేడుచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలును విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు విమర్శించారు. నేరేడుచర్లలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కుంటి సాకులతో వాయిదా వేస్తోందన్నారు. డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య, జిల్లా కార్యదర్శి శివకుమార్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కోరారు. చిల్లేపల్లి పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న బాలికల బీసీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేసి.. వినతి అందించి

మునగాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు.

మునగాల: తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయశాఖ నూతన పట్టా పాసు పుస్తకాలను మంజూరు చేయడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని బీసీ యువజన సంఘం నాయకులు లక్ష్మీనారాయణ అన్నారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

జిల్లా ఫోరం అధ్యక్షుడిగా ఇంద్రబాబు



హుజూర్‌నగర్, గరిడేపల్లి, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ సెక్రటరీ ఫోరం(టీఎన్‌జీవో) అధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన పిడమర్తి ఇంద్రబాబు ఎన్నికయ్యారు. మంగళవారం సూర్యాపేటలోని టీఎన్‌జీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంద్రబాబు ఎన్నిక జరిగింది. ఆయన ప్రస్తుతం గరిడేపల్లి మండలం గానుగుబండ పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. పంచాయతీ సెక్రటరీ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావటంపై నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.

గరిడేపల్లి: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరమ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా గుగులోతు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. గరిడేపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు మంగళవారం సూర్యాపేటలో జరిగిన సమావేశంలో ఎన్నికయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత, పరారీలో నిందితులు

చింతలపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని శోభనాద్రిగూడెంలో రేషన్ బియ్యం మంగళవారం పట్టుబడింది. ఈ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యం బస్తాల్లో తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చేసరికి బియ్యం కొనుగోలుదారులు వాహనాలను వదిలి పరారయ్యారు. నాలుగు బస్తాల బియ్యం, రెండు ద్విచక్ర వాహనాలను ఠాణాకు తరలించారు. తాము వెళ్లేసరికే వారు పరారయ్యారని ఎస్సై అంతిరెడ్డి తెలిపారు. పట్టుబడిన వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దుకాణాలు కొనుగోలు చేయడానికి వీలు లేదు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్ద మసీదు కాంప్లెక్స్‌లో అద్దెకు తీసుకొని వ్యాపారం చేసుకుంటున్న ఓ వ్యక్తి దుకాణాలను ఇతరులకు గుడ్‌విల్ కింద అమ్మేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుందని పెద్ద మసీదు మేనేజింగ్ డైరెక్టర్ షేక్.మహ్మద్ సోషల్ మీడియాలో చేసిన ఓ వీడియో హల్‌చల్ అవుతోంది. వక్ఫ్‌బోర్డు సంబంధించిన కాంప్లెక్స్‌లో దుకాణాలు కొనుగోలు చేయడానికి లేదని, ఎవరైనా అడ్వాన్స్ ఇస్తే వారే నష్టపోవాల్సి వస్తుందని అందులో పేర్కొన్నారు. శుక్రవారం దుకాణాల బహిరంగ వేలంపై ప్రకటన చేయనున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



గరిడేపల్లి, న్యూస్‌టుడే: గరిడేపల్లి గ్రామానికి చెందిన **పెండెం ధనమూర్తి**(58) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. అబ్బిరెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ధనమూర్తి మృతికి పలువురు కార్యదర్శులు, నాయకులు సంతాపం తెలిపారు.

అవీ ఇవీ

సత్కారం.. హుజూర్‌నగర్ గ్రామీణం: పార్టీ కోసం పనిచేసిన వారినే పదవులు వరిస్తాయని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వంగవీటి రామారావును కోదాడలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి సత్కరించారు.

ప్రారంభం.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని మూడో వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు మంత్రి సహకారంతో కృషి చేస్తున్నామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికను ఏఈ రాంప్రసాద్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు.

అభిషేకం.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం చేశారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి.. కోదాడ పట్టణం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలపై ఈనెల 26న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని టీపీటీఎఫ్ కోదాడ మండల శాఖ అధ్యక్షుడు సైదులు ఒక ప్రకటనలో కోరారు.

సాంకేతికతను అంది పుచ్చుకోవాలి.. కోదాడ పట్టణం: కాలనుగుణంగా మార్పులను గమనిస్తూ సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని కోదాడ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచి మేనేజర్ భానుకుమార్ అన్నారు. లియాఫీ కార్యాలయంలో 'ఎడ్యుకేషనల్ సెమినార్' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

అందజేత.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని పాత బస్టాండ్‌లో కోదాడ ఆర్టీసీ డిపో అధికారులు దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులను మంగళవారం అందజేశారు.

ఎన్నిక.. కోదాడ పట్టణం: నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆ సంఘ నాయకులు తెలిపారు. కోదాడ పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

రాఘవరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం: మల్లు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నారాయణ రాఘవరెడ్డి(69) ఇటీవల గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, పీఏసీఎస్ ఛైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, మండలి మల్లయ్య, ధనియాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.17 లక్షలు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్ శ్రీదండుమైసమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం 66 రోజులకుగానూ రూ.4,17,099 ఆదాయం సమకూరింది. నల్గొండ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈవో కే. కుశలయ్య, సీనియర్ అసిస్టెంట్ శంకర్, శ్రీనివాసరావు, సీత, శ్రీనివాస్, నాయకులు వెంకన్న, మధు, సైదులు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ ఆవరణలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సూర్యాపేట సాంస్కృతికం: జిల్లా కేంద్రంలోని శ్రీవిజయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు వరదాచార్యులు మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చన, అష్టోత్తర శతనామార్చన జరిపారు.

హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించండి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు కారింగుల ఉపేందర్, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ పసునూరి దినేష్ బాబు, సంతోష్, కేశవులు, పర్వతం శ్రీధర్, విజయకృష్ణ, సోమయ్య పాల్గొన్నారు.

విధులు కీలకం...

☛ నామమాత్రంగా వార్డు కమిటీలు

నిర్వహణ శూన్యం



సూర్యాపేట: 16వ వార్డులో ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన రోడ్డు

పురపాలికల్లో ఏర్పాటు చేసిన పట్టణ వార్డు కమిటీలు నామమాత్రంగా మారాయి. పట్టణాభివృద్ధికి గత ప్రభుత్వం పురపాలికల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. కమిటీ సభ్యులతో సమన్వయం చేయాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. వచ్చే జనవరి 25వ తేదీతో పురపాలక పాలక గడువు ముగియనుంది. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 564 మంది వార్డు కమిటీ సభ్యులుగా నియమించారు. తమ పరిధిలోని సమస్యలను గుర్తించి పాలకవర్గం, అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. ప్రగతి పనుల విషయంలో తగిన సూచనలు అందించాలి. కౌన్సిలర్, సభ్యులు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి వసతి తదితర సమస్యలను పరిశీలించాలి. ప్రస్తుతం పురపాలికల్లో ఇవేమీ అమలు కావడం లేదు. వార్డు ప్రత్యేకాధికారుల జాడే లేదు.

– సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

ఇక నుంచి సమావేశాలు నిర్వహిస్తాం
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో వార్డు కమిటీల సమావేశాలు నిర్వహించి పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం. ఎక్కడ సమస్య వచ్చినా కమిటీల ఆధ్వర్యంలో పరిష్కార మార్గం చూపుతాం. ఇక నుంచి ప్రతి నెల సమావేశాలు నిర్వహిస్తాం.

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గంలో..

	వార్డులు	కమిటీ సభ్యులు
సూర్యాపేట	48	192
తిరుమలగిరి	15	60

చర్యలు శూన్యం

జిల్లాలోని ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణాల్లో రోడ్లు, అధ్వానంగా మారాయి. శివారు కాలనీల్లో ప్రగతి చర్యలు కరవయ్యాయి. నాలాల అక్రమణలు, నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. పాలిథిన్ నిషేధంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం లేదు. బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) అమలు చేయడం లేదు. వార్డుల సమగ్రాభివృద్ధికి చర్యలు కానరావు. ఈ విషయంలో పాలకవర్గ ప్రతినిధులు చెప్పిందే మాటగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎక్కడ పనులు చేపట్టాలని సూచిస్తే అక్కడే ప్రగతి చర్యలు కనిపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని భగత్‌సింగ్‌నగర్‌లో జాతీయ రహదారి పక్కన వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి అంధకారం నెలకొని పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – జబ్బార్, సూర్యాపేట

✔ పరిశీలించి వెలిగేలా చూస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, శ్రీనివాస్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని విజయకాలనీ, జమ్మిగడ్డ, హౌసింగ్ బోర్డు కాలనీలో మురుగు కాల్వల్లో పూడిక తీయటం లేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి కునుకు లేకుండా చేస్తున్నాయి. – రమేష్, జమ్మిగడ్డ

✔ వెంటనే సిబ్బందితో పూడిక తీయిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

గంజాయి దహనం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన గంజాయిని భువనగిరి శివారులోని రోమా ఇండస్ట్రీస్‌లో దహనం చేశారు. నల్గొండ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 25 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ అనుమతితో దహనం ప్రక్రియ చేపట్టినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి 144 కిలోలు, గంజాయి చాక్లెట్లు 4.5 కిలోలు, హాష్ ఆయిల్ 40 ఎం.ఎల్ కాల్చివేశామని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల ఎక్సైజ్ అధికారులు బి.సంతోష్, ఎస్.సైదులు, ఆర్. లక్ష్మానాయక్, నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

రైలులో మహిళ ఆభరణాల చోరీ

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలులో మహిళ బంగారు ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, మౌన్యనాయక్ తండాకు చెందిన లచ్చిరాం, ఆయన భార్య మంగమ్మ సోమవారం అహ్మదాబాద్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నారు. రైలు ముత్కేడ్ స్టేషన్ వద్ద ఉండగా 35 గ్రాముల బంగారు ఆభరణాలున్న చేతి బ్యాగు చోరీకి గురైంది. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేటలోని ఓ ప్రభుత్వ వసతి గృహంలో నివాసం ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువుకు చెందిన విద్యార్థి సోమవారం రాత్రి తాను నివాసం ఉంటున్న వసతి గృహంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. తోటి విద్యార్థులు గమనించి హుటాహుటిన సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

మద్దిరాల: మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వ వెంట గొర్రెల మందను మంగళవారం మేతకు తీసుకెళ్లగా.. రక్షణ కంచెలేని విద్యుత్తు నియంత్రికను తాకి గొర్రె, శునకం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితుడు పాక సోమలింగం తెలిపారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు



నూతనకల్ పీహెచ్‌సీలో ప్రసవాల వివరాలు తెలుసుకుంటున్న ఎంహెచ్‌ఎన్ పీవో అనిత

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలకు నిర్దేశిత వైద్యసేవలు అందిస్తూ సమయ పాలన పాటించాలని జిల్లా మాతా, శిశు, ఆరోగ్య సంరక్షణ అధికారిణి(ఎంహెచ్‌ఎన్ పీవో) అనిత సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని, దవాఖానాలో గర్భిణులు, శిశువులకు అందించే వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రసవాల సంఖ్య వివరాలనడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారిణి ఆశ్రిత, సీహెచ్‌వో చరణ్ నాయక్, తారమ్మ, మాణిక్య పాల్గొన్నారు.

☛ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎయిడ్స్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంపూర్ణ సురక్ష కేంద్రం సూర్యాపేట సహకారంతో ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించి రక్తన మూనాలు సేకరించినట్లు మండల వైద్యాధికారిణి ఆశ్రిత తెలిపారు. ఐసీటీసీ కౌన్సిలర్ నర్సయ్య, నరేష్, ఉపేందర్, సీహెచ్‌వో చరణ్ నాయక్ పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయాలు సాధించాలి: మండారి



సూర్యాపేటలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ, న్యూడెమోక్రసీ నాయకులు

మహాత్మాగాంధీ రోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: విద్యార్థి ఉద్యమాలకు అరుణతారగా నిలిచిన జార్జిరెడ్డి ఆశయాలు సాధించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. పీడీఎస్‌యూ స్థాపించి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి గాంధీ పార్కు వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీపార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ విద్యార్థులు విప్లవ సమాజానికి పునాదులని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా ప్రగతిశీల ప్రజాస్వామ్య భావజాలానికి పురుడు పోసిందన్నారు. ఈ నెల 24న ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు గంట నాగయ్య, కిరణ్, చందర్‌రావు, శంకర్, సైదులు, వెంకట్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ రవి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎల్-షడ్డాయి (ఐ.పి.సి) ప్రార్థన మందిరంలో మంగళవారం ఒక రోజు బైబిల్ ఆధారిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాస్టర్లు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఇంజమూరి గాబ్రియేల్, శ్యామ్‌ప్రసాద్, ముల్లంగి జాకబ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై వి.సురేశ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రగతి డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డ్రగ్స్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎర్ర నాగయ్య, డైరెక్టర్ ఆవుల నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరీక్ష అట్టల పంపిణీ.. మద్దిరాల గ్రామీణం: మండల పరిధిలో గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి 60 పరీక్ష అట్టలను తెలుగు ఉపాధ్యాయుడు రాచమల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు.

సేవలకు గుర్తింపు ఇవ్వండి.. జాజిరెడ్డిగూడెం: నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న డీసీసీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ కమిషన్‌లో సభ్యుడిగానే నియమించడం ఎంత వరకు సమంజసమని డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు ప్రశ్నించారు. వెంకన్న సేవలకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. అర్వపల్లిలో మంగళవారం సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం.. తుంగతుర్తి గ్రామీణం: ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలని మాజీ సర్పంచి నల్లు రామచంద్రరెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు శ్యాంసుందర్, ఫిరోజ్‌లకు మంగళవారం ఆ పాఠశాలలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు లక్ష్మి, నాగునాయక్, అంగన్‌వాడీ టీచర్ శోభ, వేణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాలమహానాడు కార్యవర్గం ఎన్నిక.. నాగారం: ఈటూరులో మాలమహానాడు కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా గుండ్ల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా జక్కుల సందీప్, కార్యదర్శిగా పగిడిమర్రి సురేశ్, కోశాధికారిగా బుంగ ఇమాన్యుయేల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కంచి రాజేశ్ ఎన్నికయ్యారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ.. చివ్వెంల: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన సంఘటన చివ్వెంల మండలంలోని ఐలాపురంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నార్ల సాయిలు(57) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. సాయిలుకు ఉన్న ఒక్కగానొక్క కుమార్తె రేణుక తండ్రికి తలకొరివి పెట్టింది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మద్యం ధ్వంసం.. తుంగతుర్తి, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం, నాటు సారాయిని ఎక్సైజ్, పోలీసు అధికారులు ధ్వంసం చేశారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో సీఐలు శ్రీను, రజిత, ఎస్సైలు క్రాంతి కుమార్‌లు 16 కేసులకు సంబంధించి 800 లీటర్ల బీరు, 150 లీటర్ల విస్కీ, పది లీటర్ల నాటు సారాయిని ధ్వంసం చేశారు.

వేతనాలు రాక ఇబ్బందులు.. భానుపురి, న్యూస్‌టుడే: ఎలక్ట్రికల్ స్టోర్ హమాలీ కార్మికులకు ప్రతినెలా వేతనాలు మంజూరు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. సూర్యాపేటలోని ఎలక్ట్రికల్ ఇన్‌ఛార్జి సత్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏడు నెలలుగా వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ఆరబెట్టిన ధాన్యానికి మద్దతు ధర



చిల్పకుంట్లలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, మంచినీటి వసతులు కల్పించి కాంటాలకు కావల్సిన యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలని నూతనకల్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని చిల్పకుంట్లలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఎంపీడీవో సునీత, ఏపీవో రమణాకర్, సీఈవో వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి గ్రామీణం: గొట్టిపర్తి, బండరామారం, మంచ్యాతండా, రామన్నగూడెం, తూర్పుగూడెం, వెంపటి గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, రవీందర్‌రెడ్డి, ఏఈవో, సీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని నర్సింహులగూడెంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బ్రహ్మయ్య ప్రారంభించారు. ఏవో కృష్ణకాంత్, నిర్వాహకుడు కొడవకంటి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చిత్తలూరి ఎల్లయ్య, లింగాల నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలతో పశుసంపద అభివృద్ధి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: వైద్యుల సలహాలు పాటించి మేలురకం పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని మండల పశువైద్యాధికారి వెంకన్న అన్నారు. మండలంలోని చెట్లముకుందాపురం గ్రామంలో మంగళవారం పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి రైతులకు సూచనలందించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు నగేష్, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

పట్టణ ఠాణాలో ఓపెన్ హౌస్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా మంగళవారం సూర్యాపేట పట్టణ ఠాణాలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ విద్యార్థులకు ఆయుధాల పనితీరు, వైర్‌లెస్ సెట్ గురించి విద్యార్థులకు వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదు, పోలీసుల విధి విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

తల్లిదండ్రులు దైవ సమానులు

భానుపురి, న్యూస్‌టుడే: పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన మామిడి అంజయ్య గౌడ్ తన కుమారులు తిండిపెట్టడం లేదని సోమవారం నిరసనకు దిగారు. సూర్యాపేటలోని ఎల్ఐసీ రోడ్డులో కుమారుల వద్ద నివాసముంటున్న వృద్ధుడి విషయం తెలుసుకున్న ఆర్డీవో మంగళవారం వారిని కార్యాలయానికి పిలిపించారు. తండ్రి బాగోగులు ఎందుకు చూసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇక నుంచి ఇబ్బందులకు గురిచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను దైవంగా భావించాలన్నారు.

డాక్టరేట్



రాఘవ చైతన్య

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని మాచారం గ్రామానికి చెందిన ఇటికాల రాఘవ చైతన్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కామర్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. టాలెంట్ మేనేజ్‌మెంట్ యాన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ టాలెంట్ రిటెన్షన్ స్ట్రాటజీస్ ఎట్ సెలక్ట్ ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై యూనివర్సిటీ కామర్స్ విభాగం డీన్, సీనియర్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశానని మంగళవారం చైతన్య తెలిపారు. తల్లిదండ్రులు రాములు, శకుంతల ఆశయం మేరకు డాక్టరేట్ పట్టా అందుకున్నానని పేర్కొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆత్మకూర్(ఎస్) మండలశాఖ ఆధ్వర్యంలో ఏపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష తొలి దశలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాసిత్, ఉపాధ్యాయులు జూలకంటి వెంకటరెడ్డి, పబ్బతి వెంకటేశ్వర్లు, వెంకటేష్, నగేష్, వేణు, నాగేందర్, రమణ, విజయ, పుష్పలీల పాల్గొన్నారు.

చివ్వెంల: రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడిన ఐదు డీఏలను, పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3089	1896
జైశ్రీరాం	3109	1569
ఐఆర్-64	2016	1740
హెచ్ఎంటీ	2512	1549
కందులు	6696	3200
పెసర	6323	4488
వేరుసెనగ	5459	5459
మినుములు	5426	3526
మినుములు	5193	2393

కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



అర్వపల్లిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యంను పరామర్శిస్తున్నమాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో కొంత కాలంగా కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గపోరు దాడులకు దారితీసింది. జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ సందర్భంగా అర్వపల్లి నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో వచ్చిన జాజిరెడ్డిగూడేనికి చెందిన గుడిపెల్లి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను స్వాగతించారు. మరో వర్గం వారు తామే అసలైన కాంగ్రెస్ వారిమని, గుర్తింపు ఇవ్వాలని గతంలో ఎమ్మెల్యే అర్వపల్లికి వచ్చిన సందర్భంగా బొల్లంపల్లి స్టేజీ వద్ద ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం రాత్రి జాజిరెడ్డిగూడెంలోని మధుకర్ రెడ్డి ఇంటికి పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం వెళ్లగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దాడులు చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీర్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై బాలకృష్ణ చెప్పారు.

☛ గుడిపెల్లి మధుకర్‌రెడ్డిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బీరవోలు విక్రమ్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెంలో మధుకర్ రెడ్డి ఇంట్లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటి మీదికి వచ్చి ఇష్టానుసారంగా దాడి జరిపారని చెప్పారు.

☛ మోరపాక సత్యంను ఇంటికి పిలిపించి దాడి చేశారని, కారును ధ్వంసం చేశారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు ఆరోపించారు. అర్వపల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దాడిని ఖండిస్తున్నాం: ఆర్డీఆర్.. జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యంపై జరిగిన దాడిని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఖండించారు. అర్వపల్లిలో మంగళవారం సత్యాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, గుడిపాటి నర్సయ్య, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.